# ట్రిక్కు

కనకలింగం కోటీశ్వరుడు కాక పోయినా లక్షాధికారి అని లక్షణంగా చెప్పొచ్చు.

అతనికి పాతికెకరాల కొబ్బరితోట వుంది. పట్నంలో ఒక లాడ్జి వుంది. అంతకు మించి ఒక సిటీబస్సు వుంది.

అయితే యింకేం! అని అనుకోవచ్చు.

కానీ అతనికో 'తలనెప్పి' ఉంది.

తలనెప్పి అంటే అదేనండి! సిటీబస్సు!! అదీమధ్య తరుచూ యాక్సిడెంట్‌లకు గురయి నష్టాలు తెచ్చి పెట్టసాగింది. యాక్సిడెంట్లు అవ్వడానికి కారణమేంటో అతనెన్నిసార్లు తలబాదుకున్నా అర్థమయ్యింది కాదు.

ఆ సిటీ బస్సును అమ్మేయాలనుకున్నాడు కనకలింగం.


డ్రైవర్‌ని మార్చి చూడమని ఒక మిత్రుడు సలహా పారేశాడు.

ఆ ఆలోచన బాగుందనిపించి, కనకలింగం అలాగే చేశాడు.

అంతే! కొత్త డ్రైవర్ హయాంలో సిటీబస్సు వెళ్ళి గోతిలో పడింది. పదిహేను మందికి దెబ్బలు తగిలాయి. ముగ్గురు హాస్పిటల్‌లో మరణించారు.

వాళ్ళకి నష్టపరిహారం చెల్లించే సరికి తలప్రాణం తోకకు వచ్చింది.

ఇక లాభం లేదని ఆ బస్సును అమ్మేయాలనుకున్నాడు కనకలింగం. ఆ సమయంలో పట్నం నుండి కనకలింగం బామ్మర్ది కేశవరావు వచ్చాడు.



అతను విషయం తెల్సుకుని, బాగా ఆలోచించాడు.

ఆ మరుసటి రోజు ఏం చేశాడో తెలియదు కాని ఆ రోజు నుంచి సిటీబస్సు యాక్సిడెంట్‌కు గురవ్వలేదు.

ఆరోజే కాదు.

ఎప్పుడూ యాక్సిడెంట్‌కి గురవ్వలేదు.

"కనకలింగం బస్సు" అంటే భయపడే జనం యిప్పుడు తాపీగా ప్రయాణం చేస్తున్నారు.

ఇప్పుడు కనకలింగానికి తలనెప్పి లేదు. కానీ తన బామర్ది ఏం చేశాడోనని తెలుసుకోవాలని వుంది.

ఒకరోజు అడిగాడు కేశవరావుని బస్సు యాక్సిడెంట్ జరగకపోవడానికి గల కారణం గురించి.

అందుకు అతను నవ్వి

"ఏముంది, వెరీసింపుల్! డ్రైవర్ ముందున్న అద్దం తీయించావంతే. అది వుండడం వల్ల డ్రైవర్‌కి ఆ అద్దంలోంచి వెనుక కూర్చునే ఆడవాళ్ళు పదే పదే కనబడుతుండటంతో తన మనసును డ్రైవింగ్ మీద లగ్నం చేయలేకపోయేవాడు. అదీ సంగతి!"

కేశవరావు చెప్పింది విన్నాక కనకలింగం" అదీ సంగతి!" అనుకున్నాడు మనసులో.

— భీశెట్టి శ్రీనివాసరావు

